క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.టీయూఎఫ్‌ఐడీసీ నుంచి దాదాపు రూ.7 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేయనున్నారు.

ఘనంగా ప్రభోత్సవం

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి ప్రభోత్సవం మంగళవారం తెల్లవారుజామున ఘనంగా జరిగింది. స్వామివారి ప్రభోత్సవాన్ని రంగు రంగుల పూలు, మంగళతోరణాలతో అలంకరించారు. భాజాభజంత్రీల మధ్య భక్తులు హర హర మహాదేవా అంటూ రథాన్ని ముందుకు తీసుకెళ్లారు. వందలాది మంది భక్తులతో స్వామివారి ప్రభతోత్సవం సాగింది. వారం రోజులుగా దేవాలయంలో అఖండ భజనలు నిర్వహిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని 11 కేవీ రైల్వే స్టేషన్ రోడ్ ఫీడర్, 11 కేవీ స్టేడియం గ్రౌండ్ ఫీడర్ల పరిధిలో చెట్ల కత్తిరింపు కారణంగా బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ టూ టౌన్ ఏఈ ఆదిత్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో న్యూటౌన్, శెట్టి కాంప్లెక్స్, పాత డీఈఓ కార్యాలయం రాజేంద్రనగర్, పాల్‌సాబ్‌గుట్ట, స్టేషన్ రోడ్డు, క్రౌన్ గార్డెన్, నోబుల్ ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా బడి పండుగ

చిన్నచింతకుంట: మండలంలోని అల్లీపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బడి పండుగ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శనలు చేశారు. ప్రాజెక్టులు, సృజనాత్మక కృత్యాలు, పలు నమూనాలు, పలు ప్రయోగాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు హాజరై తిలకించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మాలిక్ షాకీర్


మాలిక్ షాకీర్

జడ్చర్ల టౌన్: జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మాలిక్ షాకీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అడహక్ కమిటీ సభ్యులు మహేశ్వర్‌రెడ్డి, ఇష్తాకరొద్దీన్ తెలిపారు. మంగళవారం జడ్చర్ల బార్ అసోసియేషన్ ఎన్నికలలో అన్ని పదవులకు కేవలం ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావటంతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు. కమిటీ ఉపాధ్యక్షులుగా రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానకార్యదర్శిగా ప్రశాంత్, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా పాండుకుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా విజయ్‌కుమార్, క్రీడా కార్యదర్శిగా లక్ష్మీనారాయణను ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సింహగిరి లక్ష్మీనృసింహస్వామి దేవాలయం సుందరీకరణ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మండపంలో మంగళవారం స్వరలహరి కల్చరల్ అకాడమీ బృందం నిర్వహించిన హనుమాన్‌చాలీసా, భక్తివిభావరి అలరించింది. హనుమాన్ చాలీసాతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. బృందం ఆలపించిన వివిధ భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై గుర్తు తెలియని ఓవ్యక్తి మృతదేహం లభించింది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ఏనుగొండ సరస్వతి దేవాలయం కమాన్ దగ్గర మంగళవారం ఉదయం ఆకస్మాత్తుగా ఓ గుర్తు తెలియని వ్యక్తి(37) కిందపడి మృతి చెందాడు. మృతదేహం జిల్లా జనరల్ ఆస్పత్రిలోని పోస్టుమార్టం విభాగంలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతుడి దగ్గర జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈనెల 6న వెంకటేష్ అనే పేరు మీద తీసుకున్న ఓపీ కాగితం లభించిందని తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

జడ్చర్ల: అదుపు తప్పిన ఓ లారీ రోడ్డు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టిన సంఘటన మంగళవారం జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై కొత్త తండా వద్ద చోటు చేసుకున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. వివరాలు.. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న ఓ లారీ తండా సమీపంలోకి రాగానే డ్రైవర్ అజాగ్రత్తతో రోడ్డు డివైడర్ పైకి ఎక్కి ఇవతల వరుసలో గల రోడ్డు పైకి వచ్చింది. మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వైపునకు వస్తున్న ఓ ఆటోను వేగంగా ఢీకొట్టింది ఆటో డ్రైవర్ నర్సింహతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడికి దెబ్బలు తగిలి ప్రాణపాయం నుంచి బయటపడ్డాడు.

నీడ కరువాయె..


చిన్నచింతకుంటలో బస్ షెల్టర్ లేక ఎండలో నిలబడిన ప్రయాణికులు

బస్ షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు
- హోటళ్లు, చెట్ల నీడే దిక్కు
- ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులకు నీడ కరువైంది. దీంతో ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తు నిలువు నీడలేక ప్రయాణికులు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు పంచాయతీ భవనం సమీపంలో నిలబడుతున్నారు. లేదంటే పక్కల ఉండే హోటళ్లు, చెట్లను ఆశ్రయిస్తున్నారు. అయితే బస్సులు, ఆటోలు వచ్చే సమయానికి హోటళ్లలో ఉన్నవారు పరుగులు తీస్తూ రావాల్సిన పరిస్థితులు. ఏళ్ల గడుస్తున్నా చిన్నచింతకుంటలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లుగా పంచాయతీ ఎన్నికల వేళ సర్పంచ్ అభ్యర్థులు బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నారే తప్ప అమలు చేయడం లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


చిన్నచింతకుంటలో బస్సు ఎక్కేందుకు వస్తున్న ప్రయాణికులు

మండలంలో 18 గ్రామాలు..

మండలంలో 18 గ్రామాలు ఉన్నాయి. ప్రజలు వివిధ గ్రామాల నుంచి ప్రతి రోజు వారి పనులపై చిన్నచింతకుంటకు వస్తూనే ఉంటారు. చిన్నచింతకుంటలో బీడీ పరిశ్రమ, ప్రతి శుక్రవారం వారం తపు సంత, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. అందుకు ఆయా పనులపై ప్రజలు చింతకుంటకు వస్తారు. అక్కడ పనులు ముగించుకొని గ్రామాలకు చేరుకునేందుకు ఆటోలు, బస్సులను ఆశ్రయిస్తారు. చిన్నచింతకుంట నుంచి ఆత్మకూర్, దేవరకద్రకు ప్రయాణించే ప్రజలు, ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులు కూడా ఎందరో ఉంటారు. బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి చిన్నచింతకుంటలో బస్ షెల్టర్ ఏర్పాటుకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.



చిన్నచింతకుంటలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల రాక కోసం ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తూ వేచి చూడాల్సిన పరిస్థితి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బస్ షెల్టర్ ఏర్పాటుచేస్తే బాగుంటుంది.
– కే.గుండన్న, స్థానికుడు, చిన్నచింతకుంట

ఏర్పాటు చేస్తాం



చిన్నచింతకుంటలో బస్ షెల్టర్ ఏర్పాటును గత పాలకులు విస్మరించారు. ఈ సమస్యను త్వరలోనే దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లాం. బస్ షెల్టర్ ఏర్పాటునకు కృషి చేస్తాం. ప్రయాణికుల ఇబ్బదులు తీరుస్తాం.
–ఎస్ .వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు, చిన్నచింతకుంట

రోల్ మోడల్‌గా మారాలి


శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు రాష్ట్రానికే రోల్ మోడల్స్ మారాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నీట్, ఎప్‌సెట్‌కు క్రాష్ కోర్సు ద్వారా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. అలాగే బీకే రెడ్డి కాలనీలోని 'నవరత్నాలు' కార్యాలయంలో బ్యూటీషియన్, మగ్గంవర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, కుట్టు పనిలో మరికొందరు శిక్షణ పొందుతున్నారు. ఈ రెండు కేంద్రాలను మంగళవారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు పయనీర్ పేరుతో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు రీడింగ్ చైర్స్, ప్యాడ్‌లు, క్యాప్‌లను అందజేశారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, బాలికల, బాలుర జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కౌసర్‌జహాన్, భగవంతచారి పాల్గొన్నారు.

పీయూలో సంప్రదాయ దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సంప్రదాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈమేరకు కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. డిపార్ట్‌మెంట్‌లో సంప్రదాయ దినోత్సవాన్ని నిర్వహించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, హెచ్‌ఓడీ జావిద్, అర్జున్‌కుమార్, అరుంధతిరెడ్డి, నాగసుధ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి

సంక్షేమ పథకాలు చేరువ చేయాలి

జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి


ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి

నవాబుపేట: ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయాల్సి ఉందని జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని యన్మన్‌గండ్ల, రుద్రారం గ్రామాల్లో నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో పలు రికార్డులు తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజకు ప్రభుత్వ పథకాలు అందించి వాటి లక్ష్యం నెరవేర్చే బాధ్యత అధికారులపై ఉందని వివరించారు. పథకాల అమలు పారదర్శకంగా జరగాలని, అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని ఆయన సూచించారు. 'రాజీవ్ యువ వికాసం'లో దరఖాస్తుల వివరాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన వివరాలపై ఆయన ఆరాతీశారు. రుద్రారంలో చలివేంద్రం ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంపీహెచ్ఓ బద్రునాయక్, ఏపీఓ జ్యోతి తదితరులున్నారు.

గడువులోగా యునిఫాంలు అందించాలి

కోయిల్‌కొండ/ నవాబుపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న యునిఫాం ఇచ్చిన గడువులోగా అందించేలా హెచ్ఎంలు చొరవ తీసుకోవాలని ఎంఈఓ వెంకటాజీ అన్నారు. జూన్ మొదటి వారంలోనే విద్యార్థులకు యూనిఫాంలు అందించాలని నవాబుపేట ఎంఈఓ నాగ్యనాయక్ పేర్కొన్నారు. మంగళవారం అయా మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. కోయిల్‌కొండ మండలంలోని 4,416 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి 5,096 మీటర్ల బట్ట వచ్చినట్లు తెలిపారు. నవాబుపేట మండలంలో దాదాపుగా 7వేల మందికి పైగా విద్యార్థులకు యూనిఫాంలు కుట్టేందుకు వీలుగా బట్ట అవసరం ఉందన్నారు. మొదటి విడతలో దాదాపుగా 3 వేల మంది విద్యార్థులకు సంబంధించి బట్టలు కుట్టేందుకు బట్ట వచ్చిందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలతో యునిఫాంలను కుట్టిస్తున్న సందర్భంగా వారికి సమయానికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.


నవాబుపేటలో మహిళా సంఘాలకు యూనిఫాంల మెటీరియల్‌ను అందిస్తున్న అధికారులు

క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ


క్షయ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న వైద్యులు, తదితరులు

మిడ్జిల్: మండలంలో పేద టీబీ(క్షయ) వ్యాధిగ్రస్తులకు మంగళవారం నిక్షేయ పోషణ్ యోజన వారి ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో 50మందికి టీబీ మందులు, పౌష్టికాహారం కిట్ పంపిణీ చేశారు. ఆ కిట్‌లో మూడు కిలోల బియ్యం, కేజి కంది పప్పు, కేజీ పల్లీలు 500 గ్రాముల వంటనూనె అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకాంత్, సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్, వైద్య సిబ్బంది, యాసిన్‌ఖాన్, ప్రసాద్, సునంద, దేవయ్య, జంగయ్య, సంపత్ పాల్గొన్నారు.

ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రాంచందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడారు. కార్మిక వర్గం భద్రత, వేతనం, ట్రేడ్ యూనియన్ హక్కుల కోసం ఉద్యమిస్తుంటే మరోవైపు రైతులు ఎంఎస్పీ కోసం, గిట్టుబాటు ధరల చట్టపరమైన హామీ కోసం పోరాడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ 1773లో చనిపోయిన ఔరంగజేబ్ సమాధి గొడవను రేకెత్తించి అమాయక హిందూ ప్రజలను రెచ్చగొట్టి ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు దేవదానం, ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాఅధ్యక్షుడు మన్నెం, గణేష్, బాలు, నర్సింహులు పాల్గొన్నారు.

ముగిసిన సీతారామ జాతర

ఘనంగా అగ్నిగుండం కార్యక్రమం

గండేడ్: శ్రీరామనవమిని పురస్కరించుకొని కొనసాగిన జాతర మంగళవారంతో ముగిసింది. మండలంలోని వెన్నాచేడ్ గ్రామంలో బండమీద రామస్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. సోమవారం రాత్రి నందికోల సేవా కార్యక్రమం నిర్వహించి వీరభద్రున్ని బండ మీద గల శివాలయం వద్దకు తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత అగ్నిగుండం తొక్కడానికి ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో స్నానమాచరించి భగభగమండే నిప్పుకణికల మీదుగా నడిచివెళ్లారు. దీంతో ఆప్రాంతం శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం శివాలయంలోని మల్లన్నకు నైవేద్యం సమర్పించారు. అనంతరం సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను భాజభజంత్రీలతో తీసుకొచ్చి గ్రామంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉంచారు. కార్యక్రమంలో శరణప్ప, నాగేంద్రకుమార్, అంతర్‌గానిరాములు, పులిందర్‌రెడ్డి, పూజార్లు జంగం జగదీష్, సదాశివ పాల్గొన్నారు.


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

బోర్ల మరమ్మతు


మోటార్ ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 2, 6వ వార్డుల్లో పాడైన బోర్లను తొలగించి వాటి స్థానంలో మంగళవారం కొత్త మోటార్లు అమర్చారు. కొత్తగా అమర్చిన మోటార్లను మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. నీటి సమస్య తలెత్తకుండా చేపట్టిన చర్యల్లో భాగంగా 13 మోటార్లు కొత్తగా కొనుగోలు చేశామని, వాటి ద్వారా సమస్య తీరుతుందని వారు అభిప్రాయపడ్డారు. మిగిలిన వార్డుల్లోనూ యుద్ధప్రాతిపదికన బోరు మోటార్లు కొత్తవి అమరుస్తున్నట్లు వెల్లడించారు. వార్డు కౌన్సిలర్లు బుక్క మహేష్, ఎస్.రమేష్, ప్రశాంత్‌రెడ్డితో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


జెడ్పీహైస్కూల్ ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్‌లో పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో వేసవికాల ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. యూనిట్–2 అధికారి డా.మాధురి ఆధ్వర్యంలో సోమవారమే 45మంది వాలంటీర్లు గ్రామానికి చేరుకున్నారు. మంగళవారం కోడ్గల్ జెడ్పీహైస్కూల్ ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి చెత్తాచెదారం తొలగించటంతో పాటు చెట్ల పాదులవద్ద శుభ్రం చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులకు సామాజిక ఆర్థిక సర్వేపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేకత అవగాహన కార్యక్రమాలతో పాటు వివిధ సామాజిక అంశాలపై గ్రామస్తులతో చర్చించనున్నారు.

ఉపాధి హామీ కూలీల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

మిడ్జిల్: మండల కేంద్రంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల హాజరు నమోదు చేయడం లేదంటూ మంగళవారం కూలీలు ఆందోళనకు దిగారు. 20 పనుల కంటే ఎక్కువ పనులు ఉండటంతో మస్టర్ జనరేట్ కాకపోవడంతో కూలీల హాజరు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉండడతో 400 మందికి 120మందికి మాత్రమే సకాలంలో హాజరు తీసుకోవడంతో, మిగతా వారు ఆందోళన చేపట్టారు. ఈవిషయం తెలుసుకున్న ఎంపీడీఓ గీతాంజలి, ఏపీఓ రాజేష్ అక్కడికి వెళ్లారు. విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్తామని, మధ్యాహ్నం వరకు హాజరు నమోదు చేస్తామని చెప్పడంతో కూలీలు పనులకు వెళ్లారు. మధ్యాహ్నం తర్వాత హాజరు నమోదు కావడంతో కూలీలు శాంతించారు.

సంతలో రైతులకు సౌకర్యాలు కల్పిస్తాం


దేవరకద్ర సంత స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి

దేవరకద్ర: దేవరకద్ర పశువుల సంత వచ్చే రైతులకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తామని మున్సిపల్ కమిషన్ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పశువుల సంత స్థలం ఎంత వరకు ఉంది అని పరిశీలించారు. పశువులను వాహనాల్లో ఎక్కించడానికి, దించడానికి వాగు పక్కన కొత్తగా దిమ్మెను కట్టిస్తామని అన్నారు. సంత స్థలంలో ఎలాంటి అక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ ఆఫీసు పక్కనే ఉన్న నర్సరీని సందర్శించారు. సంతలో నీడను ఇచ్చే మొక్కలను నాటి వాటిని రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ సీత్యానాయక్, సంత కాంట్రాక్టర్లు ఆదిహన్మంతరెడ్డి, రాంపాండు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళికతోనే అభివృద్ధి


ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అడ్డాకుల: ఆర్థిక అక్షరాస్యత పాటిస్తూ ఆర్థిక ప్రణాళికను పకడ్బందీగా అమలుచేస్తే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మూసాపేట బ్రాంచ్ మేనేజర్ ఆనంద జ్యోతి అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని ఆదర్శ రిసోర్స్ సెంటర్‌లో మంగళవారం ఆర్‌బీఐ, సిర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు డబ్బులను పొదుపు చేస్తూ కుటుంబ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు గురి కాకుండా ఉండాల్సిన విధానం గురించి వివరించారు. తహసీల్దార్ రాజునాయక్, ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు లక్ష్మి, సీసీ నాగమణి, సిర్డ్ సిబ్బంది కుర్మయ్య, అరుణ్‌కుమార్, మహేశ్వరి, వెంకటేష్‌నాయక్, శశికళరెడ్డి, శివుడు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

జడ్చర్ల టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. సత్యసాయిబాబ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ గతేడాది ఏర్పాటుచేసిన చలివేంద్రానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించినందున ఈ ఏడాది సైతం ప్రారంభించినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


కురుమూర్తిలో ఒరిగిన విద్యుత్ స్తంభం

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభం ఒక పక్క ఒరిగి ప్రమాదభరితంగా ఉంది. పైననే ఎల్‌టీ లైన్ విద్యుత్ వైర్లు ఉండటంతో గాలి వర్షాలకు వైర్లు ఒక దానికి ఒకటి తగిలి నిప్పులు రాలి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఒరిగిన విద్యుత్ స్తంభం వేసవి గాలులకు కూలిపోయే ప్రమాదం ఉంది. అమ్మాపురం నుంచి ఆత్మకూర్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఈ సమస్య నెలకొంది. ప్రమాద భరితంగా ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు తెలుపుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారుల చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

'పూర్తిస్థాయిలో స్థలాలను సర్వే చేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని పద్మావతికాలనీ, శ్రీనివాసకాలనీలలోని స్థలాలన్నీ పూర్తిస్థాయిలో సర్వే చేయాలని ఎన్జీవోల కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు పి.లక్ష్మీనర్సింహులు కోరారు. మంగళవారం స్థానిక పద్మావతికాలనీ లోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కాలనీలలో కొన్ని ప్లాట్లు వివాదాస్పదంగా, మరికొన్ని ఆక్రమణకు గురయ్యాయని పేర్కొన్నారు. వీటన్నింటికీ రీసర్వే ద్వారానే పరిష్కారం జరుగుతుందన్నారు. ఈ విషయమై ఆర్డీఓ ఇ.నవీన్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కొరవడ్డాయన్నారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ (యూజీడీ) వ్యవస్థను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని కోరారు. సొసైటీ కార్యదర్శి ఎల్లప్పగౌడ్, సభ్యులు పటేల్ సత్తయ్య, గోపాల్‌రెడ్డి, రాజసింహుడు తదితరులు పాల్గొన్నారు.